సాక్షి
ప్రకాశం
సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025



ఆయిల్ అక్రమాలు లీక్.. నకిలీలకు చెక్..
యాడ్ బ్లూ ఆయిల్ పేరుతో నకిలీ ఆయిల్ అమ్మకాలు సాగుతున్నాయి. - 8లో..



ఎకో టూరిజానికి గ్రీన్ సిగ్నల్
నల్లమలలో ఎకో టూరిజానికి సంబంధించిన జంగిల్ సఫారీతో పాటు ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయ దర్శనానికి వచ్చే నెల 1 నుంచి అనుమతించనున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34 /25

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

మధ్యతరగతికి అందుబాటులో భవనాల నిర్మాణం
- క్రెడాయ్ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సమావేశంలో తీర్మానాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న క్రెడాయ్ కమిటీ నాయకులు

ఒంగోలు సబర్బన్: మధ్యతరగతికి కూడా అందుబాటులో ఉండేలా అపార్ట్‌మెంట్లు, ఇండివిడ్యువల్ భవనాల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు క్రెడాయ్ (బిల్డర్స్ అసోసియేషన్) నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు పాత గుంటూరు రోడ్డులోని పాటిబండ్ల గోపాల స్వామి ఫంక్షన్ హాలులో క్రెడాయ్ రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. క్రెడాయ్ జిల్లా అధ్యక్షుడు జీ.రాజేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ద్రవ్యోల్బణం పెరుగుతున్న దృష్ట్యా అపార్ట్‌మెంట్ల ప్లాట్లు, వ్యక్తిగత భవనాల ధరలు పెరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని వస్తువుల మీద జీఎస్టీ తగ్గించటం మంచి పరిణామమన్నారు. సెక్రటరీ కే.ప్రసన్నాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం నాలా చార్జీలను తీసేసి, నిర్మాణాల విషయంలో స్థానిక సంస్థలకు ఆ బాధ్యతలు అప్పజెప్పిందన్నారు. వాటితో పాటు అపార్ట్‌మెంట్ల విషయంలో సెట్ బ్యాక్స్ 24 మీటర్లలోపు, 24 మీటర్లకు పైన అనే విషయంలో అందరూ అర్థం చేసుకొని ముందుకు సాగాలన్నారు. క్రెడాయ్ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ బిల్డర్స్‌కు సంబంధించిన సమస్యలు కొన్ని రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం వాటిని వెంటనే పరిష్కరిస్తే బిల్డర్లకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. తొలుత జరిగిన కార్యవర్గ సమావేశంలో కొన్ని తీర్మానాలను కమిటీ ఆమోదించింది. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ ఎస్.రఘు రామయ్య, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్.హరి ప్రసాద రావు, ట్రెజరర్ ఎం.తిరుమల, జాయింట్ సెక్రటరీ సిహెచ్.రాఘవ రెడ్డి, ఈసీ మెంబర్లు టి.వరుణ్ కుమర్, వై.ఇస్సాక్ న్యూటన్, కే.రఘునాథ్, ఏవిఎస్ బాబు, పి.నాగేశ్వరరావు, సలహాదారులు ఐవీ.వీర బాబు, ఎం.శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.



సాగు సగమే.. ఈ–క్రాప్ గగనమే

జిల్లాలో పంట నమోదు నత్తనడకన సాగుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాలుగు నెలలు దాటుతోంది. ఒక వైపు వర్షాభావ పరిస్థితులు, కొన్ని మండలాల్లో అధిక వర్షాలతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మరో పక్క ముందస్తు సాగు చేసిన పంటలు కోతకు రావడంతో నూర్పిళ్లు మొదలవుతున్నాయి. ఈదశలో రైతులకు అన్ని విధాలుగా ఉపయోగపడే ఈ–క్రాప్ నమోదుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో ఈ–క్రాప్ 37 శాతం మాత్రమే నమోదైంది. దీంతో ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసిన రైతులకు తీవ్ర నష్టం వచ్చే ప్రమాదం ఉంది. పంట నమోదు కాకపోవడంతో విపత్తుల సమయంలో పరిహారం, పంట అమ్మకాల సమయంలో ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- నత్తనడకన ఈ–క్రాప్ నమోదు
- 37.12 శాతం దాటని పంట నమోదు
- నెలాఖరుతో ముగియనున్న గడువు
- ఈ–క్రాప్ నమోదు కాకపోవడంతో రైతుల ఆందోళన
- ఇప్పటికే మొదలైన పంట కోతలు

జిల్లాలో ఈనెల 24వ తేదీకి మండలాల వారీగా ఈ-క్రాప్ నమోదు వివరాలు	
శాతం	మండలాలు
20–31 శాతంలోపు	తర్లుపాడు, తాళ్లూరు, సీఎస్‌పురం, పుల్లలచెరువు, దర్శి, హనుమంతునిపాడు, ముండ్లమూరు, పెద్దారవీడు, కొనకనమిట్ల, అర్ధవీడు, కంభం, దోర్నాల, కనిగిరి.
31–40 శాతం	12 మండలాలు
40–50 శాతం	7 మండలాలు
50–60 శాతం	3 మండలాలు
60–69 శాతం	2 మండలాలు

బేస్తవారిపేట:

జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. పంటలతో సంబంధం లేకుండా ప్రతి ఎకరా భూమిని సర్వే నంబర్ల ఆధారంగా వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో 1.30 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేయాల్సి ఉండగా కేవలం 69 వేల హెక్టార్లలో సాగైంది. సగం మాత్రమే సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ బుకింగ్ చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం కనపడుతోంది. వరిపంట 12,826 హెక్టార్లకు గాను 4,428, పత్తి 26,981కి 12,759 హెక్టార్లు, కంది 68,287కు 36,074, సజ్జ 7020 హెక్టార్లకు 2,918 హెక్టార్లలో సాగు చేశారు.

37.12 శాతం పూర్తి..

జిల్లా వ్యాప్తంగా 15,94,311 వెబ్‌ల్యాండ్ పార్శిల్స్ ఉండగా ఇప్పటి వరకు 5,91,858 ల్యాండ్ పార్శిల్స్ మాత్రమే పంట నమోదు పూర్తయింది. ఇంకా 63 శాతం ల్యాండ్ పార్శిల్స్‌కు ఈ–క్రాప్ నమోదు కావాల్సి ఉంది. ఈ నెల 30వ తేదీ లోపు ఈ–క్రాప్ నమోదు గడువు పూర్తి కానుంది. దీంతో వ్యవసాయశాఖ సిబ్బంది లక్ష్యాన్ని చేరుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. గడువులోపు పంట నమోదు కాకుంటే విపత్తుల సమయంలో పరిహారం, పంట అమ్మకాల సమయంలో ఇబ్బందులు ఏర్పడతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సమన్వయ లోపం..

పంటల నమోదు వ్యవసాయ, రెవెన్యూ శాఖల సమన్వయంతో పూర్తి చేయాల్సి ఉంది. రైతులతో కలిసి పంట పొలాలకు వెళ్లి అక్కడ సాగులో ఉన్న పంట వివరాలు, సర్వే నంబర్ ఆన్‌లైన్‌లో నమోదు చేసి ధ్రువీకరణ చేసిన తర్వాతనే ఈ–క్రాప్ పూర్తి చేయాల్సి ఉంది. కానీ రెండు శాఖల మధ్య సమన్వయం లోపించింది. రెవెన్యూ సిబ్బంది ఈ ప్రక్రియకు దూరంగా ఉంటున్నారు.

బదిలీల నేపథ్యంలో..

వీఏఏల బదిలీల నేపథ్యంలో చాలా మంది నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. అక్కడక్కడా కొందరు వ్యవసాయ సిబ్బంది మాత్రమే ఈ ప్రక్రియను మమ అనిపిస్తున్నారు. గ్రామంలో ఎక్కడో ఒకచోట కూర్చొని తూతూమంత్రంగా నమోదు చేస్తున్నారనే విమర్శలు బలంగా వినపడుతున్నాయి. దీంతో ఈ–క్రాప్ నమోదులో స్పష్టత ఎంత వరకూ అన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది.



ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారి

నత్తనడకకు కారణాలు:

- గుట్టలు, చిల్లకంప ఉన్న సర్వే నంబర్లలో దగ్గరికి వెళ్తేకానీ జియో ట్యాగింగ్ తీసుకోవడం లేదు.
- కొత్తగా వీఏఏలు గ్రామాలకు రావడంతో రైతులపై, గ్రామంలోని సర్వే నంబర్లపై పట్టు లేకపోవడం.
- ప్రభుత్వ నూతన నిబంధనల ప్రకారం సర్వే నంబర్ల వారీగా పంట సాగు చేసిన లేదా బీడుగా ఉన్నా జియో మ్యాపింగ్ చేసి, ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఈ తతంగం క్షేత్ర స్థాయిలో పూర్తికావడానికి ఎక్కువ సమయం పడుతోంది.
- భూములు రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పీ నంబర్లకు వ్యవసాయశాఖ సిబ్బంది దగ్గరున్న సర్వే నంబర్లకు సరిపోకపోవడంతో సమస్య ఎదురవుతోంది.
- బయోమెట్రిక్ పడని రైతులకు ఐరిస్ చేయడానికి సిగ్నల్ సమస్య వేధిస్తోంది.
- వెబ్‌ల్యాండ్, అటవీ భూముల్లో పంటలు ఉన్నా లేకపోయినా ఫీల్డ్ సర్వే చేయాలి. బీడు భూములను అయిదేళ్లకు పైగా సాగు చేయనివి, 1–5 ఏళ్ల మధ్య చేయనివి, ఈ ఏడాది మాత్రమే చేయనిగా విడదీయాలి.

> **నా పంట ఈ-క్రాప్‌లో నమోదు కాలేదు**
>
> ఐదు ఎకరాల్లో కందిపంట సాగుచేశాను. నా పంట ఈ–క్రాప్‌లో నమోదు చేసేందుకు అధికారులు రాలేదు. ఈ–క్రాప్ విధానాన్ని సక్రమంగా అమలు చేయకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరపొందే అవకాశాన్ని కోల్పోతాం. పండించిన పంటలు కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలంటే ఈ–క్రాప్ నమోదై ఉండాలి.
>
> – పీ సుబ్బారెడ్డి, రైతు, బేస్తవారిపేట

పెరిగిన భారం..అందని జీతం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిరుద్యోగుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ప్రభుత్వం కొన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుండటంతో ఇప్పటికే కొందరు చిరుద్యోగులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడగా మరి కొందరు ఉద్యోగులు జీతాలు సక్రమంగా అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యశాలల్లో ఔట్‌సోర్సింగ్ శానిటరీ కార్మికులుగా పనిచేస్తున్న వారికి ఇచ్చే కొద్దిపాటి జీతాలు కూడా సక్రమంగా ఇవ్వకుండా నెలల తరబడి జాప్యం చేస్తుంటే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- చిరుద్యోగుల కష్టాలు పట్టని కూటమి ప్రభుత్వం
- నెలల తరబడి జీతాలు లేక అవస్థలు పడుతున్న శానిటరీ వర్కర్లు
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సుమారు 230 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు
- వైద్యశాలలు అప్ గ్రేడ్ చేసినా సిబ్బందిని పెంచకపోవడంతో పెరిగిన పని భారం
- ధర్నాలకు దిగుతున్నా స్పందించని వైనం

కంభం: కూటమి ప్రభుత్వం తీరుతో ప్రభుత్వ వైద్యశాలల్లో ఔట్ సోర్సింగ్ కింద పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న సిబ్బంది నెలల తరబడి జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 18 వైద్యశాలల్లో సుమారు 230 మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులున్నారు. కంభం, గిద్దలూరు, దోర్నాల, యర్రగొండపాలెం, పామూరు, కనిగిరి, పొదిలి, కొండపి, చీమకుర్తి, ఒంగోలు, మార్కాపురం తదితర వైద్యశాలల్లో వీరంతా విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ థర్డ్ పార్టీ ఏజన్సీ ద్వారా జీతాలు చెల్లిస్తుంటారు. శానిటరీ పనిచేసే సిబ్బందికి రూ.11,858, సూపర్ వైజర్లకు రూ.13,500 జీతం ఉంటుంది.

సిబ్బందిని పెంచకపోవడంతో పెరిగిన పని ఒత్తిడి:

'ఫస్ట్ ఆబ్జెక్టివ్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ ద్వారా ప్రభుత్వ వైద్యశాలలో శానిటరీ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. 30 పడకల వైద్యశాలలో 8 మంది, 50 పడకల వైద్యశాలలో 13 మంది, 100 పడకల వైద్యశాలల్లో సుమారు 30 మంది వరకు విధులు నిర్వహించాల్సి ఉంది. శానిటరీ ఉద్యోగులు విధుల్లో చేరిన కొంతకాలానికే కొన్ని వైద్యశాలలు 30 పడకల నుంచి 50 పడకలకు, 50 పడకల నుంచి 100 పడకల వైద్యశాలలుగా అప్ గ్రేడ్ అయ్యాయి. అప్ గ్రేడ్ చేసిన తర్వాత అందుకు తగ్గట్టుగా సిబ్బంది సంఖ్యను పెంచకపోవడంతో తమ పై పనిభారం పెరిగిందని శానిటరీ వర్కర్లు వాపోతున్నారు.



యర్రగొండపాలెం ఏరియా వైద్యశాల వద్ద జీతాల కోసం ధర్నా చేస్తున్న సిబ్బంది (ఫైల్)

6–7 నెలలుగా అందని వేతనాలు:

జూన్, జూలై నెలల వరకు జీతాలకు సంబంధించిన బిల్స్ పంపించినప్పటికీ జీతాల విడుదలలో జాప్యం ఎందుకని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలోని కొన్ని వైద్యశాలల్లో 5–6 నెలల జీతాలు పెండింగ్ లో ఉండగా, మరికొన్ని చోట్ల 7 నెలల వరకు జీతాలు రాలేదని ఉద్యోగులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించే ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో పాత ఏజెన్సీ తొలగించి కొత్త వారికి అప్పగిస్తే తమ జీతాల పరిస్థితి ఏంటని ఉద్యోగుల్లో ఆందోళన మొదలవుతోంది. గతంలో పీఎఫ్ డబ్బులు ప్రతినెలా తమ ఖాతాల్లో జమయ్యేవని, గత కొన్ని నెలలుగా పీఎఫ్ డబ్బులు తమ ఖాతాల్లో జమ కావడం లేదని కార్మికులు వాపోతున్నారు. ఎవరిని అడిగినా స్పందించడం లేదని ఉన్నతాధికారులు స్పందించి జీతాలతో పాటు పీఎఫ్ డబ్బులు ప్రతి నెల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆందోళన బాటలో కార్మికులు:

సుమారు ఏడు నెలలుగా జీతాలు ఇవ్వకుంటే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని, వెంటనే జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వ తేదీ యర్రగొండపాలెం ఏరియా వైద్యశాల వద్ద సీఐటీయూ నాయకులతో కలసి పారిశుద్ధ్య కార్మికులు సమ్మెకు దిగారు. ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించకపోతే అదే బాటలో మిగిలిన వైద్యశాలల్లో పనిచేసే సిబ్బంది ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు. సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలి వైద్యశాలకు రోగులు క్యూ కడుతున్న నేపథ్యంలో శానిటరీ వర్కులు ఆందోళన బాటకు దిగితే వైద్యశాలల్లో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా మారిపోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

> **కుటుంబ పోషణ భారంగా మారింది**
>
> 
>
> నాకు భర్త లేదు, ఇద్దరు పిల్లలున్నారు. నాకు వచ్చే జీతం మీదే మా కుటుంబం ఆధార పడి ఉంది. ఆరు నెలలుగా జీతం ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. వైద్యశాలలో శానిటేషన్ పనులు, ఇతర పనులు చేస్తూ వైద్యశాలను శుభ్రంగా ఉంచుతున్న తమకు వెంటనే జీతాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
>
> – యు.కాశమ్మ, స్వీపర్

> **ఆరు నెలల జీతాలు ఇవ్వాలి**
>
> 
>
> 6 నెలలగా జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందిగా ఉంది. జీతాలు ఎప్పుడిస్తారో ఎవరూ సమాధానం చెప్పడం లేదు. 22 నెలల పీఎఫ్ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. జీతాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వైద్యశాల 50 పడకలుగా అప్‌గ్రేడ్ అయినా అందుకు తగ్గట్టుగా సిబ్బందిని పెంచకపోవడంతో పని భారం పెరిగింది.
>
> – కె.రామారావు, సూపర్‌వైజర్, కంభం ప్రభుత్వ వైద్యశాల

> **ఏడు నెలల జీతాలు ఇవ్వాలి**
>
> 
>
> ఏడు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. ఉన్నతాధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. జీతాల కోసం ధర్నా చేసినా అధికారులు స్పందించలేదు. జీతాలు వెంటనే విడుదల చేయాలి.
>
> – కాశిరెడ్డి, సూపర్ వైజర్ యర్రగొండపాలెం ఏరియా వైద్యశాల

కూటమి అరాచకాలను ఎదుర్కొనేందుకే
డిజిటల్ యాప్



డిజిటల్ బుక్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచకాలను ఎదుర్కోవటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక డిజిటల్ బుక్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు దొండేటి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాదులో ఐటీ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న జిల్లాకు చెందిన వారు డిజిటల్ బుక్ యాప్‌ను ఆదివారం ఎమ్మెల్యేతో ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అన్నివర్గాలకు చెందిన పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలను పక్కనపెట్టి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై సాధింపు చర్యలకు పాల్పడుతోందని, అన్యాయాన్ని ప్రశ్నిస్తే పోలీసులతో కేసులు నమోదు చేయిస్తున్నారని ఆయన విమర్శించారు. అటువంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు జగనన్న డిజిటల్ బుక్ యాప్‌ను ప్రారంభించారన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగితే ఈ యాప్‌లో నమోదవుతుందని, ఈ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి అవగాహన పరచాలని అన్నారు. కార్యక్రమంలో పెద్దారవీడు మండల మాజీ జెడ్పీటీసీ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, పెద్దదోర్నాల మండల పార్టీ కన్వీనర్ గంట వెంకటరమణారెడ్డి, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు దుద్యాల రామకృష్ణారెడ్డి, లింగంగుంట్ల ప్రవీణ్, వెన్నా కాశీశ్వరరెడ్డి, కొల్లి నాగేశ్వరరెడ్డి, మూల హర్షవర్ధన్, కందుల వెంకటసుబ్బారెడ్డి, పతంగి అంజిరెడ్డి పాల్గొన్నారు.

గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలి

- గిరిజనుల సంక్షేమానికి ఉద్దేశించిన నిధులను గిరిజనులకే ఖర్చు చేయాలి
- జీపీఎస్ జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ నాయక్

ఒంగోలు వన్‌టౌన్: గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎస్టీ కమీషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశం ఒంగోలు గిరిజన భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ జాబితాలో ఇతరులను చేరిస్తే ఉద్యమిస్తామన్నారు. మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతోందన్నారు. గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. గిరజన హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. గిరిజనులకు కనీసం ఇంటి వసతి, గానీ, మంచి నీటి వసతి గానీ లేని గ్రామాలు ఇప్పటికీ అనేకం ఉన్నాయన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేని గిరిజనులకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి వీటిని ఏర్పాటు చేయాలన్నారు. గిరిజనుల సంక్షేమానికి ఉద్దేశించిన నిధులను గిరిజనులకే ఖర్చు చేయాలని కోరారు. షెడ్యూల్డు తెగల జాబితాలో సుగాలీ, చెంచు, ఎరుకల, యానాది, నక్కల అనేక జాతు ఉన్నాయని వీరందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించడంలేదన్నారు. మైదాన ప్రాంతాలైన కదిరి, కావలి, మాచర్ల, జగ్గయ్య పేట, నాలుగు అసెంబ్లీ స్థానాలను ఎస్టీలకు రిజర్వేషన్ చేయాలన్నారు. సమావేశంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, గిరిజన ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం, ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ కుమార్ ధర్మా, జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు విష్ణునాయక్, డాక్టర్ బాలాజీ నాయక్, ఆర్ హనుమా నాయక్, జె సంతోష్ నాయక్, ఏ శ్రీను నాయక్, రవీంద్ర నాయక్, దుర్గా నాయక్, జీ గణేష్ నాయక్, బండి రూతమ్మ, కాకి రమణమ్మ, పాములేటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: సాక్షాత్తు శాసనసభలోనే హోం మంత్రి వంగలపూడి అనిత ఒక కులానికి చెందిన వ్యక్తిని ఇంకొక కులానికి చెందిన వ్యక్తిగా తన పేరును మార్చి చదవడమనేది అత్యంత దిగజారుడు రాజకీయమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. అసెంబ్లీలో శనివారం హోం మంత్రి అనిత గుర్రం చలపతి చౌదరిపై మాట్లాడుతూ ఆయన చౌదరి కాదని, రెడ్డి కులానికి చెందిన వాడని వ్యాఖ్యానించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇంత దిగజారుడు రాజకీయం చేసే పరిస్థితికి కూటమి ప్రభుత్వం రావడం వారి పరిపాలనకు అద్దం పడుతోందన్నారు. చంద్రబాబు సామాజిక వర్గంలో వచ్చిన వ్యతిరేకతను, జగనన్నపై ఉన్న అభిమానాన్ని తట్టుకోలేకే కుల ప్రస్తావన చేయకూడని చట్టసభలో ఆ విధంగా మాట్లాడినందుకు కచ్చితంగా క్షమాపణ చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీలో కమ్మ వాళ్లు ఉండకూడదు, ఉంటే వారిని ఏవిధంగానైనా డామేజ్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పినట్లేనని ఆయన అన్నారు. గుర్రం చలపతి చౌదరిది మేడపి అని, వాళ్లది చౌదరి కుటుంబం, వైఎస్సార్ సీపీలో కమ్మ సామాజిక వర్గానికి చెందినవారు, జగనన్న అభిమానులు లక్షల మంది ఉన్నారనటానికి ఇదో ఉదాహరణ అని అన్నారు. గతంలో నాని, వల్లభనేని వంశీలను కమ్మ సామాజిక వర్గంలో వైఎస్సార్ సీపీలో బలంగా ఉన్నవారిని ఏ విధంగా ఇబ్బందిపెట్టారో.. అదేవిధంగా చిట్టచివరికి సోషల్ మీడియా వారిపై కూడా ఈ కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తుందనటానికి మచ్చుతునక అని అన్నారు.



ఆయిల్ అక్రమాలు లీక్.. నకిలీలకు చెక్..!

- డీజిల్ వాహనాలలో వాడే యాడ్ బ్లూ ఆయిల్ పేరుతో సింగరాయకొండ మండలంలో దందా
- ప్రముఖ కంపెనీల ఆయిల్ అంటూ నకిలీ ఆయిల్ అమ్మకం
- జాతీయ రహదారిపై విమానాల రన్‌వే పక్కన నాశిరకం యాడ్ బ్లూ ఆయిల్ విక్రయం
- ప్రముఖ బ్రాండ్ల ఆయిల్ అని చెప్పడంతో నమ్మి కొనుగోలు చేసి మోసపోతున్న వాహనదారులు
- ప్రముఖ కంపెనీ ప్రతినిధి ఫిర్యాదుతో ఆయిల్ మాఫియా మోసాలు బట్టబయలు
- కేసు నమోదు చేసి పలువురిని అరెస్టు చేసిన పోలీసులు


యాడ్ బ్లూ ఆయిల్ పాయింట్ వద్ద ప్రముఖ బ్రాండ్ల పేరుతో ఉన్న నకిలీ ఆయిల్ డబ్బాలు

సింగరాయకొండ: డీజిల్ వాహనాల నుంచి వెలువడే ప్రమాదకరమైన నైట్రోజన్ ఆక్సైడ్ (ఎన్‌ఓఎక్స్) ఉద్గారాలను తగ్గించి వాయు కాలుష్యాన్ని నివారించడానికి డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ (డీఈఎఫ్) అనే ఆయిల్‌ను వినియోగిస్తారు. దీనినే యాడ్ బ్లూ ఆయిల్ అని అంటారు. బీఎస్–6 డీజిల్ వాహనాలలో యాడ్ బ్లూ ఆయిల్‌ను కచ్చితంగా వాడాలి. లేకుంటే వాహనం ఆగిపోవడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా ఉంటాయి. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు అక్రమార్కులు నకిలీ ఆయిల్ తయారు చేసి విక్రయిస్తున్నారు. ప్రముఖ కంపెనీల ఆయిల్ అంటూ వాహనదారులను నమ్మించి మోసం చేస్తున్నారు. జాతీయ రహదారిపై సింగరాయకొండ మండలంలోని విమానాల రన్‌వే పక్కన ఈ అక్రమ వ్యాపారం కొన్నాళ్లుగా జోరుగా సాగుతోంది. ఇటీవల ఒక ప్రముఖ కంపెనీ ప్రతినిధి ఫిర్యాదు చేయడంతో ఆయిల్ మాఫియా గుట్టు రట్టయింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. ప్రముఖ కంపెనీల ఆయిల్ పేరుతో నకిలీ ఆయిల్ విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.80 వేల విలువైన 20 లీటర్ల డబ్బాలు 68 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

7 పాయింట్ల ద్వారా నాశిరకం ఆయిల్ విక్రయాలు...

డీజిల్ వాహనాల ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని సంరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం యాడ్ బ్లూ ఆయిల్‌ను ప్రవేశపెట్టింది. 2022 నుంచి బీఎస్–6 మోడల్ కార్ల నుంచి భారీ వాహనాల వరకు అన్నింట్లో ఈ ఆయిల్ ఉపయోగిస్తారు. ఆయా వాహనాలలో డీజిల్ ట్యాంకు పక్కనే యాడ్ బ్లూ ఆయిల్ ట్యాంకు ఉంటుంది. వాహనాన్ని బట్టి 20 నుంచి 60 లీటర్ల కెపాసిటీతో ఈ ఆయిల్ ట్యాంకులు ఉంటాయి. లీటరు యాడ్ బ్లూ ఆయిల్ ధర 60 రూపాయలు ఉంటుంది. కొందరు అక్రమార్కులు సాధారణ కంపెనీలు తయారు చేసిన నాశిరకం ఆయిల్ తీసుకొచ్చి ప్రముఖ బ్రాండ్ల స్టిక్కర్లు వేసి అమ్మకాలు సాగిస్తూ వాహనదారులను మోసగిస్తున్నారు. జాతీయ రహదారిపై సింగరాయకొండ మండల పరిధిలో ఉన్న విమానాల రన్‌వే పక్కన రోడ్డుకు ఇరువైపులా సుమారు సంవత్సర కాలంగా ఈ ఆయిల్ అమ్మకాలు సాగిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఐరన్ స్టాండ్ల మీద తెల్లట్యాంకు ఏర్పాటు చేస్తారు. తమ వద్ద ప్రముఖ బ్రాండ్ల యాడ్ బ్లూ ఆయిల్ దొరుకుతుందని బోర్డులు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. రన్‌వే పక్కన 7 పాయింట్లలో ట్యాంకుల ద్వారా వాహనాలకు నేరుగా ఆయిల్ నింపుతున్నారు. ప్రముఖ బ్రాండ్ల లేబుళ్లు ఉన్న 20 లీటర్ల డబ్బాలు కూడా అమ్ముతారు.

వారానికి ఒకసారి ప్రముఖ బ్రాండ్ల పేరుతో ఉన్న నకిలీ ఆయిల్ డబ్బాలను లారీలలో తీసుకొచ్చి వీరికి కొందరు అప్పగిస్తున్నారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన సిబ్బందిని ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్న ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతుండగా, ఓ ప్రముఖ ఆయిల్ కంపెనీకి చెందిన ప్రతినిధి ఈ నెల 24వ తేదీ దీనిపై ఫిర్యాదు చేశారు. విమానాల రన్ వే పక్కన రాజ్ ఎంటర్ ప్రైజెస్, మహదేవ్ మోటార్స్, బాలాజీ మోటార్స్ పేరు మీద నిర్వాహకులు ప్రముఖ బ్రాండ్ల పేరుతో ఉన్న యాడ్ బ్లూ ఆయిల్ క్యాన్‌లు తీసుకొచ్చి వాహనదారులను మోసం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్ద ట్యాంకులలో యూరియా, వాటర్ కలిపి యాడ్ బ్లూ ఆయిల్ తయారు చేసి మరీ విక్రయిస్తున్నారని ఆరోపించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


హైవేపై విమానాల రన్ వే పక్కన కలికవాయ ఫ్లై ఓవర్ సమీపంలో ఉన్న ఆయిల్ స్టాక్ పాయింట్


కందుకూరు ఫ్లై ఓవర్ సమీపంలో ఉన్న యాడ్ బ్లూ ఆయిల్ స్టాక్ పాయింట్

హైవేపై పోలీసుల పర్యవేక్షణ శూన్యం...

ఆయిల్ మాఫియాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న జాతీయ రహదారిపై పోలీసులు పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంవత్సరం నుంచి ఒడిశాకు చెందినవారు యాడ్ బ్లూ ఆయిల్ పేరుతో అక్రమ వ్యాపారం చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి విమానాల రన్‌వేకి ఇరువైపులా ఎలాంటి షాపులు ఏర్పాటు చేయకూడదు. కానీ, ఆయిల్ మాఫియా అక్కడ 7 పాయింట్లు ఏర్పాటు చేసి మరీ ఒడిశా సిబ్బందిని ఏర్పాటు చేసి నకిలీ ఆయిల్ విక్రయిస్తుంటే.. పోలీసులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీరు ఎవరు.. ఎక్కడి నుంచి వచ్చారు.. ఇక్కడ ఏం చేస్తున్నారు.. వారు చేస్తోంది అక్రమమా.. సక్రమమా అని ఏరోజైనా పోలీసులు పట్టించుకున్నారా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. నేటికీ యాడ్ బ్లూ ఆయిల్ అమ్మే ఆయిల్ ట్యాంకులను పోలీసులు స్వాధీనం చేసుకోకపోవడంతో అవి ఇప్పటికీ రోడ్డు పక్కనే ఉన్నాయి. వాటిలో పనిచేసే సిబ్బంది పరారయ్యారని పోలీసులు చెబుతుండటం విశేషం. గత ఆరు నెలల క్రితం విమానాల రన్‌వే పక్కన కళ్యాణ మండపం సమీపంలో లారీల నుంచి డీజిల్ చోరీ చేసే ముఠా స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసుకుందని పత్రికలలో కథనాలు రావటంతో అక్కడి నుంచి దుకాణం ఎత్తివేశారని, అతనికి పోలీసుల సహకారం కూడా ఉందని అప్పట్లో జోరుగా ప్రచారం జరిగిన నేపథ్యంలో యాడ్ బ్లూ ఆయిల్ మాఫియా పట్ల కూడా ఏడాది నుంచి పోలీసులు పట్టించుకోకపోవడం, ఓ కంపెనీ ప్రతినిధి ఫిర్యాదు చేసినా మొక్కుబడిగా చర్యలు తీసుకోవడంతో పోలీసుల తీరుపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

దుకాణాలు తొలగించాం

రాజస్తాన్‌కు చెందిన ముఠా ఆధ్వర్యంలో యాడ్ బ్లూ ఆయిల్ మాఫియా జరుగుతోంది. వీరు యూరియా, నీరు కలిపిన మిశ్రమాన్ని ప్రముఖ కంపెనీ బ్రాండ్ల పేరుతో అమ్ముతున్నారన్న ఫిర్యాదు రావడంతో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నాం. 20 లీటర్ల ఆయిల్ డబ్బాలు 68 స్వాధీనం చేసుకున్నాం. మిగిలిన వారు పరారయ్యారు. ప్రస్తుతం ఆ దుకాణాలు తొలగించాం.

– బి.మహేంద్ర, ఎస్సై, సింగరాయకొండ

పెంపుడు కుక్కలకు రేబిస్ రాకుండా చూసుకోవాలి

- క్రమం తప్పకుండా రేబిస్ ఇంజక్షన్లు వేయించాలి
- జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ రవికుమార్
- వరల్డ్ రేబిస్ డే సందర్భంగా ఒంగోలులోని పశువైద్యశాలలో ఉచితంగా రేబిస్ ఇంజక్షన్లు


పెంపుడు కుక్కకు రేబిస్ ఇంజక్షన్ చేస్తున్న జిల్లా పశుసంవర్థకశాఖ జేడీ రవికుమార్

ఒంగోలు సబర్బన్: పెంపుడు కుక్కలకు రేబిస్ రాకుండా వాటి యజమానులు క్రమం తప్పకుండా రేబిస్ ఇంజక్షన్లు వేయించాలని పశుసంవర్థకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ సూచించారు. ఆదివారం వరల్డ్ రేబిస్ డేని పురస్కరించుకుని ఒంగోలు సంతపేటలోని జిల్లా పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న వెటర్నరీ పాలీక్లినిక్‌లో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ ఇంజక్షన్లు వేశారు. ఈ కార్యక్రమాన్ని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కే వెంకటేశ్వరరావు ప్రారంభించగా, ఒంగోలు నగరంలోని పెంపుడు కుక్కల యజమానులు వాటిని తీసుకొచ్చి రేబిస్ ఇంజక్షన్లు వేయించారు. సుమారు 275 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా టీకాలు వేసినట్లు సంతపేటలోని పాలీక్లినిక్ పశువైద్యుడు, పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.జగత్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్ బాబ్జి, పశువైద్యులు డాక్టర్ సురేంద్ర, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

సెపక్ తక్రా విజేతలు.. తూర్పుగోదావరి, శ్రీకాకుళం



పురుషుల విభాగంలో విజేతగా నిలిచిన తూర్పుగోదావరి జిల్లా జట్టు



మహిళల విభాగంలో విజేతగా నిలిచిన శ్రీకాకుళం జిల్లా జట్టు

ఒంగోలు: సెపక్ తక్రా రాష్ట్రస్థాయి పోటీల్లో పురుషుల విభాగంలో తూర్పుగోదావరి జిల్లా జట్టు, మహిళల విభాగంలో శ్రీకాకుళం జిల్లా జట్టు విజేతలుగా నిలిచాయి. పురుషుల విభాగంలో కర్నూలు జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో, ప్రకాశం, అనంతపురం జిల్లాల జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో, కోనసీమ అంబేడ్కర్, తూర్పుగోదావరి జిల్లా జట్లు తృతీయ స్థానం సాధించాయి. స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన 35వ రాష్ట్ర స్థాయి పోటీల ముగింపు కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, సెపక్ తక్రా జిల్లా చైర్మన్ డాక్టర్ కృష్ణసాయి, కార్యదర్శి డి.రవిప్రసాద్, శాప్ కోచ్ పి.వేణు, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

పవన్ కళ్యాణ్‌ని అడ్డుపెట్టుకుని సనాతన ప్రచారం


మాట్లాడుతున్న సాగర్

ఒంగోలు టౌన్: పవన్ కళ్యాణ్‌ని అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తున్నారని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సీఎస్ సాగర్ విమర్శించారు. నగరంలోని మాదాల నారాయణస్వామి భవన్‌లో ఆదివారం సత్యశోధక్ సమాజ్ 153వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సభకు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.మోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత ఓటు బ్యాంకును సంఘటితం చేసుకోవడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ శక్తులు అధికారంలోకి వచ్చాయని చెప్పారు. దళిత కులాల మధ్య గల సాంస్కృతిక వైరుధ్యాన్ని ఉపయోగించుకుని కులవ్యవస్థలను కాపాడుతున్నాయని విమర్శించారు. దక్షిణ భారతదేశంలో కూడా కులవ్యవస్థలను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. దళిత కమ్యూనిస్టులు ఏకమై కుల వ్యవస్థను ధ్వంసం చేయాలని పిలుపునిచ్చారు. అందుకోసం విప్లవ శక్తులు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్, అఖిల భారత రైతు కూలీ సంఘ జిల్లా అధ్యక్షుడు నాంచార్లు, అరుణోదయం సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ జాలన్న పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్ కుటుంబం గ్రామ బహిష్కరణ

- ప్రార్థనకు చర్చికి వెళ్తున్నారని ఇంటికి తాళాలు
- తాగునీటి పైపులైన్ తొలగింపు


ఇంటికి తాళాలు వేయడంతో బయట కూర్చున్న బాధితులు


కొత్తపట్నం: చర్చికి వెళుతున్నారనే నెపంతో ఒక కుటుంబాన్ని గ్రామం నుంచి బహిష్కరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ వివరాల్లోకి వెళితే.. కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామ పంచాయతీ పరిధిలో చెంచుపాపాయిపాలెం పట్టపుపాలెంలో మాజీ సర్పంచ్ బసంగారి ప్రసాద్ తల్లి రాములమ్మ ఈతముక్కలలోని చర్చిలో ప్రార్థన కోసం వెళ్తుంటారు. అలా చర్చికి వెళ్లడం గ్రామ కాపులకు ఇష్టం లేదని గత సంవత్సరం నుంచి ఆ కుటుంబాన్ని తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గ్రామంలోని రచ్చబండ వద్దకు పిలవడం, మీ తల్లి చర్చికి వెళ్లడం ఆపకపోతే మీ కుటుంబాన్ని గ్రామం నుంచి వెలివేస్తామని హెచ్చరించడం జరుగుతూ వస్తోంది. గత సంవత్సరం క్రిస్మస్ పండుగ నుంచి గ్రామపెద్దల వేధింపులు ఎక్కువయ్యాయి. వారి ఇంటికి తాగునీటి పైపులైన్ కట్ చేశారు. ప్రసాద్ ట్రాక్టర్, జేసీబీలు తిప్పుతుంటాడు. గ్రామంలోని ఓ హేచరీకి ట్యాంకర్లతో నీళ్లు తోలుతుంటాడు. ఈ క్రమంలో గ్రామస్తులు హేచరీ నిర్వాహకులను ప్రసాద్ చేత నీళ్లు తెప్పించుకున్నా.. ఇతర ఏ పనులు చేయించుకున్నా హేచరీ మూతవేయిస్తామని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో హేచరీ నిర్వాహకులు అతడి చేత పనులు ఆపించారు. ఈ క్రమంలో ఆదివారం ప్రసాద్ ఇంట్లోని వ్యక్తులను బయటకు పిలిపించిన గ్రామకాపులు బలవంతంగా ఇంటికి తాళం వేశారు. గతంలో గ్రామంలో కొంత మొత్తాన్ని ఎవరో ఒకరు పాటలాగా పాడుకుని ఆ డబ్బులు వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తుంటారు. ప్రసాద్ కూడా కొంత నగదు తీసుకున్నాడు. డబ్బు తిరిగి చెల్లించలేదన్న కారణంతో ఇంటికి తాళం వేశామని గ్రామకాపులు చెబుతున్నారు. వాస్తవానికి వచ్చే నెల 20వ తేదీ వరకు పాట చెల్లింపు గడువు ఉందని, కేవలం తన తల్లి చర్చికి వెళ్తుందన్న కారణంతోనే ఇలా ఇంటికి తాళం వేశారని ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. గ్రామంలో నుంచి తమ కుటుంబాన్ని వెలివేసే హక్కు వారికి ఎవరిచ్చారని ప్రశ్నిస్తున్నాడు. ఈ విషయంపై కొత్తపట్నం పోలీసులకు ఫోన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు.

కారు ఢీకొని మహిళ మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆగి ఉన్న ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ఈఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. పామూరు మండలం మార్కొండాపురం గ్రామానికి చెందిన రాగిపిండి విజయదుర్గ (35), చంద్రశేఖర్‌రెడ్డి భార్యాభర్తలు. వారు మరమరాలు విక్రయిస్తూ జీవిస్తున్నారు. వారి కుమారుడు కృష్ణా జిల్లా పెనమలూరు మండలం తాడిగడపలో ఒక ప్రైవేట్ ఇంటర్మీడియెట్ కళాశాలలో చదువుతున్నాడు. దసరా సెలవులు సందర్భంగా కుమారుడిని ఇంటికి తీసుకెళ్లేందుకు భార్యాభర్తలు ఇద్దరు శనివారం రాత్రి నగరానికి చేరుకున్నారు. బంధువుల ఇంటికి వెళ్లే క్రమంలో బందరురోడ్డులోని వివంతా హోటల్ వద్దకు ఆదివారం తెల్లవారుజాము ఒంటి గంట సమయంలో చేరుకున్నారు. చంద్రశేఖర్‌రెడ్డి ఆటో దిగి డ్రైవర్‌కు డబ్బులు ఇస్తుండగా విజయదుర్గ లగేజీ తీసుకుంటూ ఆ వాహనంలోనే ఉండిపోయింది. అదే సమయంలో బెంజిసర్కిల్ వైపు నుంచి కంట్రోల్ రూమ్ వైపు అతివేగంగా ప్రయాణిస్తున్న కారు ఆగి ఉన్న ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో కొంచెం ముందుకు వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఆటోలో ఉన్న విజయదుర్గకు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. ఆటోడ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎకో టూరిజానికి గ్రీన్ సిగ్నల్


- వచ్చే నెల 1వ తేదీ నుంచి తెరుచుకోనున్న జంగిల్ సఫారీ
- మొదలు కానున్న ఇష్టకామేశ్వరి అమ్మవారి దర్శనం


ఇష్టకామేశ్వరి ఆలయం

పెద్దదోర్నాల: నల్లమల అటవీ ప్రాంతంలోని ఎకో టూరిజానికి సంబంధించిన జంగిల్ సఫారీలతో పాటు నల్లమలలోని ప్రసిద్ధి గాంచిన ఇష్టకామేశ్వరి అమ్మవారి దేవాలయ యాత్రలు వచ్చే నెల 1వ తేదీ నుంచి పునః ప్రారంభించనున్నట్టు పెద్దదోర్నాల రేంజి అధికారి హరి తెలిపారు. పెద్దపులులు తమ సంతానోత్పత్తి ప్రక్రియను కొనసాగించేందుకు అనువైన వాతావరణం కల్పించేందుకు జూలై 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30 తేదీ వరకు దట్టమైన అభయారణ్యంలోని నిషిద్ధ ప్రాంతాల్లోకి పర్యాటకులు, ప్రజలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. సాధారణంగా నిషేధిత సమయం పూర్తిగా వర్షాకాలం కావడంతో కురిసిన వర్షాలతో అడవంతా పచ్చగా దట్టమైన చెట్లు, పొదలతో నిండి ఉంటుంది. ఈ కాలంలోనే పెద్దపులులు తాము జత కట్టిన ఆడపులులతో ప్రశాంతంగా సంచరిస్తుంటాయి. ఈ నేపథ్యంలో వాటి స్వేచ్ఛకు భంగం కలిగించకుండా ఉండాలనే ఉద్దేశంతోనే దేశవ్యాప్తంగా ఉన్న 50 పులులు సంరక్షణా కేంద్రాల్లోని ఎకోటూరిజాలు, జంగిల్ సఫారీలలో పర్యాటకులను సంచరించకుండా కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. నల్లమల అటవీ ప్రాంత పరిధిలోని పలు ప్రాంతాల్లో మూత పడిన ఎకో టూరిజాలతో పాటు పలు పర్యాటక కేంద్రాలు అక్టోబర్ 1వ తేదీ నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. దీంతో గిద్దలూరు సమీపంలో ఉన్న పచ్చర్ల, ఆత్మకూరు సమీపంలో ఉన్న బైర్లూటి, మండల పరిధిలోని తుమ్మలబైలు, ఎకోటూరిజాలకు సంబంధించిన జంగిల్ సఫారీలతో పాటు, యర్రగొండపాలెం మండల పరిధిలో ఉన్న ఇష్టకామేశ్వరి ఆలయాలు అక్టోబర్ 1వ తేదీ నుంచి తెరుచుకోనున్నాయి.

అక్షరాయుధం.. జాషువా కవిత్వం

- డీఆర్వో ఓబులేసు


జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో, ఇతర అధికారులు

ఒంగోలు వన్‌టౌన్: జాషువా కవిత్వం సామాజిక అసమానతలపై చేసిన పోరాటంలో అక్షరాయుధంగా నిలిచిందని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) చిన్న ఓబులేసు అన్నారు. గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలను స్థానిక కలెక్టరేట్‌లోని జాషువా విగ్రహం వద్ద జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్వో మాట్లాడుతూ తన రచనల ద్వారా సమాజంలో సంస్కరణలకు పాటుపడిన వ్యక్తి గుర్రం జాషువా అని కొనియాడారు. కార్యక్రమంలో ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏపీ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, తదితరులు పాల్గొని జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత నాయకులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం – ఆర్టీసీ బస్సు ఢీ


ప్రమాదానికి కారణమైన కర్ణాటక ఆర్టీసీ బస్సు


మృతిచెందిన జశ్వంత్

- యువకుడు దుర్మరణం


జశ్వంత్ (ఫైల్)

పెద్దదోర్నాల: ఎదురెదురుగా వచ్చిన కర్ణాటక ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన కర్నూలు – గుంటూరు జాతీయ రహదారిపై కొత్తూరు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చిత్తూరు జిల్లా మదనపల్లె తంబళ్లపల్లికి చెందిన బీటెక్ విద్యార్థి ఈడకొట్టు జశ్వంత్ (20) దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న ఏఎస్సై కృష్ణమూర్తి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఈ సంఘటనకు సంబంధించి కృష్ణమూర్తి కథనం మేరకు.. కర్నూలు నుంచి ద్విచక్ర వాహనంపై పెద్దదోర్నాల మండల కేంద్రం వైపునకు వస్తున్న జశ్వంత్‌ను శ్రీశైలం నుంచి ఆత్మకూరు వైపునకు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు కొత్తూరు వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన జశ్వంత్.. సంఘటన స్థలంలోనే తుదిశ్వాస విడిచాడు. మృతుడు మార్కాపురం పట్టణంలోని ఏ1 గ్లోబల్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించనున్నట్లు ఏఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు చెప్పారు.

80 మంది పేకాటరాయుళ్ల అరెస్టు


పొదిలి పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాటాడుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసులు పేకాట, కోడిపందేలు, మట్కా స్థావరాలపై పంజా విసిరారు. జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రోన్ కెమెరాలతో జల్లెడ పట్టారు. కలుగులో దాక్కున్న ఎలుకలను పట్టుకున్నట్లు కొండ ప్రాంతాలు, పొలాలతోపాటు రహస్య ప్రదేశాలలో పేకాటాడుతున్న వారిని పట్టుకున్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా 16 ప్రదేశాలలో దాడులు నిర్వహించి 80 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి 1,35,800 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. చీమకుర్తి, మద్దిపాడు, పొదిలి, తర్లుపాడు, త్రిపురాంతకం, కొండపి, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, అర్ధవీడు పోలీసుస్టేషన్లలో ఒక్కో కేసు చొప్పున నమోదు చేశారు. కంభం, యర్రగొండపాలెం పోలీసు స్టేషన్లలో రెండు కేసుల చొప్పున నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా సరే పేకాట, మట్కా, కోడిపందేలకు పాల్పడితే వదిలిపెట్టేదిలేదని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.

ఇద్దరు బైకు దొంగల అరెస్టు

మార్కాపురం: ఇంటిముందు పార్క్ చేసిన బైకును దొంగతనం చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి బైకును స్వాధీనం చేసుకున్నట్లు మార్కాపురం సీఐ సుబ్బారావు ఆదివారం తెలిపారు. మార్కపురం ఏకలవ్యకాలనీలో నివాసం ఉండే కె.అశోక్ తన ఇంటిముందు ఈ నెల 25వ తేదీ రాత్రి బైకును పార్కుచేసి లోపలికి వెళ్లాడు. ఉదయం చూడగా బైకు కనిపించకపోవడంతో మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం నాగులవరం రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న పట్టణంలోని 10వ వార్డుకు చెందిన మాజీద్, ఇనాయక్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. వారే బైకు దొంగతనం చేసినట్లు అంగీకరించడంతో అరెస్టు చేశారు. వారి నుంచి బైకును స్వాధీనం చేసుకున్నారు.